క్లుప్తంగా

ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం



చింతపూడిలో నిర్మించిన సీసీ రోడ్డు

పెళ్లకూరు: మండలంలోని చింతపూడిలో రూ. 7 లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్డు నిర్మించారు. ఇటీవల గ్రామంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలోని అరుంధతీయ కాలనీ, బీసీ కాలనీలో ప్రజలు తమ కాలనీల్లో రోడ్లు నిర్మించాలని అభ్యర్థించారు. ఈ మేరకు ఆయన నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టి, పూర్తి చేశారు.

ముమ్మరంగా వరి కోతలు



ఓజిలిలో వరి కోస్తున్న యంత్రం

ఓజిలి: మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. బత్తలాపురం, మానమాల, భట్లకనుపూరు తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటను నూర్పిడి చేస్తున్నారు. వాతావరణంలో మార్పులతో పొలాల్లో నీరున్నా చైన్‌మిషన్లతో పంట కోయిస్తున్నారు. వరికి గిట్టుబాటు ధర కూడా ఉండడంతో వరికోతలకు ఆసక్తి చూపుతున్నారు. కురుగొండ, కుందాం గ్రామాల్లోని సహకార సంఘాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న వారితో ఎంవీఐ

గూడూరురూరల్: రక్తదానం ప్రాణందానంతో సమానమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ సునీల్ తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్టీఓ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తందానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 30 మంది నుంచి రక్తం సేకరించారు. ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో అతి వేగంతో, మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం



అసోసియేషన్ నేతలను సన్మానిస్తున్న ఆ సంఘం నాయకులు

నాయుడుపేటటౌన్: ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా నూతన కమిటీకి ఎన్నికైన సూళ్లూరుపేట నియోజవర్గ నేతలకు సోమవారం సన్మానం చేశారు. నెల్లూరు జెడ్పీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో ప్రధాన కార్యాదర్శిగా నాయుడుపేటకు చెందిన వి దేవ ప్రసన్నకుమార్, సూళ్లూరుపేటకు చెందిన పవన్ కుమార్, జిల్లా జేఏసీ సభ్యుడిగా వాకాడుకు చెందిన ఆనంద్‌బాబు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో వారిని నాయుడుపేటలో ఆ సంఘం నాయుడుపేట తాలుకా కార్యదర్శి కే దయాకర్, జిల్లా సభ్యులు కే ఆనందకుమార్, భరిణి తదితరులు ఘనంగా సన్మానించారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

పెళ్లకూరు: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని చింతపూడి, పసుపుకండ్రిగ గ్రామాలకు చెందిన పలువురు దళితులు సోమవారం స్పందనలో తహసీల్దార్ ప్రసాద్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. నివాస స్థలాలు లేనివారందరికీ స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఎంపీపీ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 10.758 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 10.7589 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 280 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 110 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

డీఎస్పీతో తంబిరెడ్డి భేటీ

నాయుడుపేటటౌన్: డీఎస్పీ శ్రీనివాసులురెడ్డిని సోమవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీకి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: నిత్యం ప్రజల్లోనే ఉందాం.. కలసికట్టుగా.. పనిచేద్దాం.. మళ్లీ వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సైదాపురం సమీపంలోని ఎల్లసిరి గోపాల్‌రెడ్డి గార్డెన్‌లో సోమవారం 31 పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. వెంకటగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇప్పటివరకు సుమారు 76 వేల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి, సమగ్రంగా వివరించామన్నారు. నిత్యం ప్రజల కోసం శ్రమించే వైఎస్సార్ సీపీకి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడంతో పాటు వెంకటగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తున్న జగనన్నను రెండో సారి కూడా సీఎంగా చేసుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ విజయాన్ని కృషి చేసే ప్రతి కార్యకర్త, నాయకుడికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేస్తే, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రూ.50 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించి నియోజకవర్గ పరిధిలో 107 సచివాలయాలు నిర్మించినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయసాధన దిశగా రాష్ట్రంలో వైనాట్ 175 అనే నినాదంతో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయభేరి మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రవికుమార్, పార్టీ కార్యవర్గ సభ్యులు వీ ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జీ శివకుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, వైస్ ఎంపీపీలు టీ భాస్కర్, ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ బీ వెంకటేశ్వర్లు రెడ్డి, నేతలు మాలకొండారెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం



అవార్డులందుకున్న వలంటీర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: ప్రభుత్వానికి ప్రజలకు నడుమ వారధుల్లా పనిచేస్తున్న వలంటీర్లు సేవలు అమోఘమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కొనియాడారు. సూళ్లూరుపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం వలంటీర్లుకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజీవయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి వలంటీర్లను సన్మానించి, అభినందించారు. సేవారత్న అవార్డుకు ఎంపికైన సూళ్లూరు వలంటీర్ తుమ్మా భారతి, నాగరాజుపురం వలంటీర్ వీరవరపు చరణ్‌కుమార్, మన్నారుపోలూరు వలంటీర్ వీ భారతి, బాపూజీ కాలనీ వలంటీర్ నిమ్మల జ్యోత్స్న, న్యూకాలనీ వలంటీర్ ఇలకా రమాదేవిని ఘనంగా సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే మరో 190 మంది వలంటీర్లుకు సేవామిత్ర అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ డీ శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ముందుచూపుతో వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి, సంక్షేమ పథకాలను లబ్ధిదారుల గడప వద్దకే చేర్చుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు జన్మభూమి కార్యక్రమంలో అర్జీలు ఇచ్చి, కార్యాలయాల చుట్టూ తిరిగినా అవి బుట్టదాఖలా అయ్యేవన్నారు. నేడు జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు ముంగిటే అందుతున్నాయన్నారు. నలభైఏళ్ల రాజకీయ చరిత్ర, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నానని పదే పదే డప్పు కొట్టుకునే చంద్రబాబు ప్రజలకు మంచి చేసిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పీ పద్మా మిల్టన్, చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు ఎస్ సౌజన్య, పీ విజయలక్ష్మి, యూ రమ్య, కే జనార్దన్, షేక్ జబీనా, కృష్ణ బలిజ పూసల సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ టీ ప్రసాద్, పార్టీ నాయకులు ఏ శ్రీధర్, ఏ సురేష్, ఎం శ్రీనివాసులు, సయ్యద్ ఫయాజ్, కే శ్రీరామ్మూర్తి, ఎస్ గోపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి



మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న మేరిగ మురళీధర్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మేరిగ

చిల్లకూరు(చిట్టమూరు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం పొదుపు మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి చెందితేనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి అండగా నిలుస్తున్నారన్నారు. చిట్టమూరు మండలంలోని 608 స్వయం సహాయక సంఘాల్లోని 6,128 మంది సభ్యులకు రూ. 4.39 కోట్లు ఆసరా పథకం కింద అందిస్తున్నామన్నారు. గతంలో చంద్రబాబు పసుపు, కుంకుమ పేరుతో పొదుపు మహిళలను మోసం చేశారన్నారు. అనంతరం మహిళలకు మెగా చెక్కు అందజేశారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

వలంటీర్ల సేవలు అభినందనీయమని మేరిగ మురళీధర్ అన్నారు. చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించేలా సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. అనంతరం వలంటీర్లకు శాలువలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సీ వెంకటసుబ్బయ్య, వైస్ ఎంపీపీలు బీ వెంకటరమణయ్య, ఆర్ సుబ్బమ్మ, సీనియర్ నాయకులు డీ శేషురెడ్డి, కే కస్తూర్‌రెడ్డి, రాజీవ్‌రామిరెడ్డి, సీ కోదండరామిరెడ్డి, ఎం మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

వెంకటగిరి(సైదాపురం): రాజ్యసభ్య సభ్యుడు విజయసాయిరెడ్డి ఇటీవల రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేతులు మీదుగా సంసద్ రత్న అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయనకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. విజయసాయిరెడ్డి అవార్డు అందుకోవడం ఆనందదాయకమన్నారు.

నేడు ఆరోగ్యసురక్ష

రాపూరు: మండలంలోని సిద్ధవరం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత పరీక్షలు, మందులు అందిస్తామన్నారు.

నేడు మాజీ సీఎం జనార్దన్‌రెడ్డి జయంతి

వెంకటగిరిరూరల్: మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి వేడుకలు పట్టణంలోని జనార్దన్‌రెడ్డి కాంస్య విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా ఉదయం ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం, మధ్యాహ్నం 12 గంటలకు పేదలకు అన్నదానంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశాయి.

రాపూరులో..

రాపూరు: మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం మూడురోడ్ల కూడలిలో వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

పరిహారం చెల్లించి పనులు చేసుకోండి



మాట్లాడుతున్న సర్పంచ్ సుబ్రహ్మణ్యం

చిల్లకూరు: ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి తమకు పరిహారం ఇవ్వకుండా పనులు చేపట్టవద్దని, పరిహారం చెల్లించి సజావుగా పనులు చేసుకోండని స్థానికులు పరిశ్రమల ప్రతినిధులను సోమవారం అడ్డుకున్నారు. ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో పనులు చేపట్టడానికి వచ్చిన పలు పరిశ్రమల ప్రతినిధులను వారు అడ్డుకున్నారు. లింగవరం సర్పంచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బకింగ్ హామ్ కెనాల్‌కు సమీపంలోని తమ్మినపట్నంలోని సర్వే నంబర్ 816తోపాటు మరికొన్ని సర్వే నంబర్లలో ఉన్న భూముల్లో ఆ సమీపంలో ఉన్న ఏడు గ్రామాలకు చెందిన వారు ఎన్నో ఏళ్లుగా వేరుశనగ సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే ఈ భూముల్లో కొంత మేర అసైన్‌మెంటు పట్టాలు ఉండగా మరి కొంత సీలింగ్ భూములున్నాయన్నారు. వీటిని ఏపీఐఐసీకి కేటాయించినట్లు చెప్పడంతో కొంత మంది పరిశ్రమల యాజమాన్యాలు ఆ భూముల్లో చదును చేసేందుకు యంత్రాలను తీసుకుని వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ సుబ్రహ్మణ్యంతో పాటుగా పలు గ్రామాలకు చెందిన స్థానికులు అక్కడికి చేరుకుని, పరిశ్రమల ప్రతినిధులను అడ్డుకున్నారు. అనంతరం పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ ఏపీఐఐసీ అధికారులు వచ్చిన అనంతరం భూమిలో పనులు చేపడతామని వెనుదిరిగారు.

మరోసారి ప్రజాదర్బార్‌కు సిద్ధం



మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

వెంకటగిరిరూరల్: మరోసారి ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి, వెంకటగిరి ప్రజల అనుమానాలను నివృత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక త్రిభువని సెంటర్ సమీపంలోని సర్వే నంబర్ 207/10లో 48 సెంట్ల భూమి వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఎస్‌ఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 1962లో పోలయ్య అనే వ్యక్తికి పట్టా మంజూరు చేసినట్లు తెలిపారు. అయితే పోలయ్య కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా ఆ స్థలంలోకి రాని కారణంగా ఆ స్థలాన్ని ప్రభుత్వపరం చేసి, బోర్డు ఏర్పాటు చేశామన్నారు. అయితే పోలయ్య కుటుంబ సభ్యులు 1966 నుంచి 2023 వరకు హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో పిటిషన్‌లు దాఖలు చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ స్థలంలో ప్రభుత్వానికి సంబంధించిన పనులు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ స్థలంపై పట్టణ ప్రజలకు సందేహాలుంటే నివృత్తి చేసేందుకు మరో రెండు రోజుల్లో వెంకటగిరిలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి తహసీల్దార్ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, డిప్యూటీ తహసీల్దార్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై లక్ష్మీనరసింహుడు



గజవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: మండలంలోని గోనుపల్లెలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి సోమవారం గజవాహనంపై ఊరేగారు. గోనుపల్లెలో పెంచలకోన దేవస్థానానికి అనుబంధ ఆలయమైన గొల్లబోయస్వామి ఆలయంలో గొల్లబోయస్వామి జన్మనక్షత్రమైన మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకుని ఉదయం స్వామి వారి మూలమూర్తికి పాలు, తేనె, చందనం, పెరుగు, పసుపు, నారికేళ జలం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం పూలంగిసేవ, గోపూజ, హోమం నిర్వహించారు. సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారిని గజవాహనంపై కొలువుదీర్చి, మంగళవాయిద్యాల నడుమ గోనుపల్లె ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, వినోద్‌స్వామి, బాలాజీస్వామి, వర్ధన్‌స్వామి పాల్గొన్నారు.

చేపలకు మంచి డిమాండ్



చేపలు కొనుగోలు చేస్తున్న మాంసం ప్రియులు

చిల్లకూరు: గూడూరు డివిజన్ పరిధిలో మాంసం ప్రియులు చేపలపై మక్కువ చూపుతున్నారు. దీంతో చేపలకు మంచి డిమాండ్ ఏర్పడింది. మార్కెట్‌తోపాటుగా రోడ్డు పక్కన విక్రయించే వారి వద్ద జనం గుంపులు గుంపులుగా చేరడంతో విక్రయదారులు కిలో చేప రూ.200 వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. నెల్లూరు జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందుతుందని కథనాలు రావడంతో స్పందించిన అధికారులు పలు ప్రాంతాల్లో చికెన్ విక్రయాలు నిలిపివేశారు. దీంతో గూడూరు ప్రాంతంలో కూడా బర్డ్‌ఫ్లూ ఉంటుందని మాంసం ప్రియులు చేపల కొనుగోలుపై మక్కువ చూపుతున్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయండి



సమీక్షిస్తున్న ఈఓపీఆర్డీ మాణిక్యం

చిల్లకూరు: ఆర్థిక సంవత్సరం ముగింపులోపు గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేయాలని ఈఓపీఆర్డీ మాణిక్యం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో ఇంటి పన్నుతోపాటుగా పలు చిన్నతరహా పరిశ్రమల నుంచి రావాల్సిన పన్ను బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. గతంలో ఇంటి పన్నుకు సంబంధించి ఎవరికైనా జామీనులు అవసరమైనప్పుడు మాత్రం వచ్చి ఇంటి పన్నులు చెల్లించి, మిగిలిన సందర్భాల్లో పన్ను విషయమై ఇంటి యజమానులు పట్టించుకోవడం లేదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరికీ డిమాండ్ నోటీసులు ఇచ్చి పన్నులు వసూలు వేగవంతం చేయాలని సూచించారు.

తెలుగుగంగ నీటిని విడుదల చేయండి

చిల్లకూరు: మండలంలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు తెలుగు గంగ నీటిని స్వర్ణముఖి ద్వారా విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ వినతిపత్రం అందజేశారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ చిట్టమూరు మండల నాయకులతో కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ చిట్టమూరు మండలంలో తాగనీటి వనరుల్లో నీరు అడుగంటిపోవడంతో పలు ప్రాంతాల్లో బుదరనీరు వస్తుందని, దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో కూడా తాగునీటి కోసం తెలుగు గంగ నీటిని విడుదల చేయాలని కోరామని చెప్పారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తక్షణం తెలుగు గంగ నీటిని విడుదల చేసి, మండల ప్రజల దాహార్తి తీర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన అర్జీని పరిశీలించామని, త్వరలోనే తెలుగు గంగ నీటిని విడుదల చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు ఎం విజయకుమార్‌రెడ్డి, ఎస్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు డీ శేషురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెళకువలు పాటించాలి

- యూరియా తక్కువ మోతాదులో వాడాలి
- పశువుల పేడ, సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రసాయన ఎరువులతో భూమి నిస్సారం



వరి పంటకు ఎరువు చల్లుతున్న రైతులు

ఓజిలి: పంటల సాగులో మెళకువలు పాటించాలని, తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి తెలిపారు. వరి పంట సాగుచేసే రైతులు ఎరువుల వాడకం, నీటి యాజమాన్యంపై ఆమె పలు సూచనలు చేశారు. తక్కువ మోతాదులో యూరియాకు వేపచెక్క కలిపి వినియోగించాలన్నారు. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల మేర కాలిబాటలు వదలాలని, దీంతో గాలి బాగా సోకి పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. సస్యరక్షణ ఆమె మాటల్లోనే..

నత్రజని ఎరువుల వాడకం మేలు

వరిలో పైపాటుగా నత్రజని ఎరువులు వాడకం ఉత్తమం. అవగాహన లేని రైతులు ఎక్కువగా కాంప్లెక్ ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి పెరిగి నష్టాలను చవిచూసే పరిస్థితి నెలకొంటోంది. నాట్లు వేసే సమయంలో మాత్రమే కాంప్లెక్స్ ఎరువులు వాడాలి. మిగిలిన సమయాల్లో నత్రజని శాతం ఎక్కువగా కల్గిన యూరియాను వాడితే పంటలో అధిక దిగుబడి వస్తుంది. ప్రధానంగా నాట్లు వేసే ముందు, దమ్ము చేసే సమయంలో పశువుల పేడ, సేంద్రియ ఎరువులు వేయాలి. అలాగే వేపాకు, జిల్లేడు, కానుగ తదితర చెట్ల ఆకులు వేసి నేలను కలియ దున్నితే భూసారం పెరుగుతుంది.

ఎరువుల వినియోగంలో మెళకువలు

యూరియాను పైపాటుగా మూడు దఫాలుగా వేసుకుంటే మంచిది. ఒక్కోసారి 30 కేజీల చొప్పున వేయాలి. దీని వల్ల నాట్లు త్వరగా పచ్చగా మారి పిలకలు అధికంగా వస్తాయి. రెండో దఫా నాట్లు వేసిన 40 రోజులకు వేసుకోవాలి. ఈ సమయంలో వరి పైరు పొట్ట, వెన్ను విడిచే దశలో ఉంటుంది. ఈ క్రమంలో నత్రజని వాడకం వల్ల వెన్ను సైజు, వెన్నులో గింజల సంఖ్య పెరగడానికి వీలుకలుగుతుంది. మూడో దఫాగా వరిపైరు నాటిన 50 నుంచి 60 రోజుల మధ్యలో వేయాలి. ఈ సమయంలో వరిపైరు వెన్నులతో పూర్తిగా బయటకు వచ్చేందుకు సహాయపడుతుంది. యూరియా వాడకం ద్వారా వెన్నులోని అన్ని గింజలు నిండడానికి, గింజ బరువు పెరగడానికి ఉపయోగపడుతుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

పొలంలో యూరియా వేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా పొలంలో తక్కువగా నీరు ఉండేలా చూసుకోవాలి. నేల బురదగా ఉండి వేసిన యూరియా త్వరగా నీటిలో కలిసిపోయి మొక్కకు పోషకాలు త్వరగా అందుతాయి. యూరియాతోపాటు వేపనూనే కలిపి చల్లితే నత్రజని వినియోగ సామర్థ్యం పెరిగి ఎక్కువ దిగుబడి వస్తుంది.